సాక్షి విజయనగరం

మంగళవారం ၊ 3 ၊ డిసెంబర్ ၊ 2024



వినతుల పరిష్కారం

ప్రజావినతుల పరిష్కార వేదికకు వచ్చే వినతులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన తర్వాతనే పరిష్కరించాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అధికారులకు తెలిపారు. - 8లో



కుంకీ ఏనుగులు ఎక్కడ?

పార్వతీపురం మన్యం జిల్లాలోని పలు గ్రామాల్లో ఏనుగులు సంచరిస్తూ పంట నష్టం కలిగిస్తున్నాయి. ఏనుగులను మళ్లించే ఏర్పాట్లు చేయాలని రైతులు కోరుతున్నారు. - 8లో



ఎంటీఎస్‌లకు పూర్తయిన బదిలీలు

పార్వతీపురం మన్యం జిల్లాల్లో ఎంటీఎస్ పద్ధతిలో పనిచేస్తున్న 1998 బ్యాచ్ ఉపాధ్యాయులకు సోమవారం నిర్వహించిన బదిలీలు పూర్తయ్యాయి. - 8లో

న్యూస్‌రీల్

గంజాయి వ్యాపారుల ఆస్తులను జప్తుచేస్తాం

- విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టి



విజయనగరం క్రైమ్: విశాఖ రేంజ్ పరిధిలో గంజాయి వ్యాపారుల ఆస్తులను గుర్తించి జప్తు చేస్తామని విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టి అన్నారు. విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాలకు చెందిన ఎస్పీలు, డీఎస్పీలు, సీఐలతో సోమవారం జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. గంజాయి వ్యాపారుల ఆస్తుల గుర్తింపులో సాధించిన పురోగతిపై ఆరా తీశారు. ప్రభుత్వ ఆదేశాలతో గంజాయి నిందితుల ఆస్తులను గుర్తించడంపై దిశానిర్దేశం చేశారు.

శతశాతం ఉత్తీర్ణతకు 'సంకల్పం'

- 'సంకల్ప్-25' తరగతులు ప్రారంభం
- ఫిబ్రవరి 5 వరకు కొనసాగింపు




నెల్లిమర్ల జూనియర్ కళాశాలలో సాగుతున్న 'సంకల్ప్-25' తరగతులు

విజయనగరం అర్బన్: ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించేందుకు ఇంటర్మీడియట్ విద్యాశాఖ 'సంకల్ప్-25' పేరుతో వినూత్న కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించింది. చదువులో వెనుకబడిన విద్యార్థులకు ప్రతిరోజు సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు కళాశాల ప్రాంగణంలో స్టడీ అవర్ నిర్వహిస్తారు. అక్టోబర్‌లో నిర్వహించిన త్రైమాసిక పరీక్షల్లో వచ్చిన మార్కుల ఆధారంగా విద్యార్థులను మూడు గ్రూపులుగా విభజించారు. చదువులో వెనుకబడిన విద్యార్థులు ఐదారుగురిని ఒక్కో అధ్యాపకుడు దత్తత తీసుకుంటారు. వీరందరూ చదువులో ప్రగతి చూపించేలా చూడాల్సిన బాధ్యత ఆ అధ్యాపకుడిపై ఉంటుంది. అన్ని కళాశాలలకు సమాధానాలతో రూపొందించిన క్వశ్చన్ బ్యాంక్ ఇస్తారు. రోజువారీ అధ్యయనంలో భాగంగా విద్యార్థులందరూ మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు క్వశ్చన్ బ్యాంక్ చదివి ప్రశ్నలకు జవాబులు రాయాల్సి ఉంటుంది. గతంలో ఉదయం 9.30 నుంచి 4.30 గంటల వరకు తరగతులు నిర్వహించేవారు. ప్రస్తుతం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహిస్తున్నారు. సంకల్ప్ కార్యక్రమం ఫిబ్రవరి 5వ తేదీ వరకు కొనసాగుతుందని ఇంటర్మీడియట్ ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి మజ్జి ఆదినారాయణ తెలిపారు. విద్యార్థులందరూ అన్ని సబ్జెక్టుల్లో ఉత్తీర్ణులయ్యేలా టైమ్‌టేబుల్ రూపొందించి తర్ఫీదు ఇస్తామన్నారు. వారానికి మూడు రోజుల పాటు స్టడీ అవర్స్‌ను డీవీఈఓ, ఆర్ఐఓ సందర్శిస్తారన్నారు.

అభివృద్ధి పనులు వేగంగా పూర్తిచేయాలి

- రాష్ట్ర ఎంఎస్ఎంఈ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్



మాట్లాడుతున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

విజయనగరం అర్బన్: జిల్లాలో ఇటీవల చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలని జిల్లా అధికారులకు రాష్ట్ర ఎంఎస్ఎంఈ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సూచించారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి పనులపై కలెక్టరేట్‌లో సోమవారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. డ్వామా, రాజీవ్ విద్యా మిషన్, ఆర్‌డబ్ల్యూఎస్, ఇరిగేషన్ తదితర శాఖల వారీగా పనులను, ఇసుక సరఫరా, బిల్లుల చెల్లింపు తదితర అంశాలపై మంత్రి సమీక్షించారు. ఎస్ఆర్ఈజీఎస్ పథకం కింద చేపట్టిన రహదారులు, కాలువలు, గోకులాల పనుల ప్రగతిని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మంత్రికి వివరించారు. పల్లె పండగ కార్యక్రమంలో మంజూరు చేసిన పనుల వివరాలను తెలియజేశారు. సాగునీటి సంఘాల ఎన్నికల నోటిఫికేషన్‌ను ఈ నెల 5న విడుదల చేసి 8న ఎన్నికలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్టు వెల్లడించారు. అనంతరం మీడియాతో మంత్రి మాట్లాడుతూ సుమారు రూ.250 కోట్ల విలువైన మెటీరియల్ కాంపోనెంట్ పనులను ప్రభుత్వం జిల్లాకు మంజూరు చేసిందన్నారు. కేంద్ర ప్రభుత్వం 2021లో జారీ చేసిన ఆదేశాలకు అనుగుణంగా వెండార్స్‌తో పనులు చేపట్టామని చెప్పారు. రోడ్ల నిర్మాణం పూర్తయిన వెంటనే గ్రామాల్లో ఇతర మౌలిక వసతుల కల్పనపై దృష్టి పెడతామని తెలిపారు. సమావేశంలో డ్వామా పీడీ ఎ.కళ్యాణచక్రవర్తి, పంచాయతీరాజ్ ఎస్ఈ ఎం.శ్రీనివాస్, ఇతర శాఖల జిల్లా అధికారులు, ఇంజినీర్లు పాల్గొన్నారు.

బతుకుబాట



చిత్రంలో కనిపిస్తున్న పూడి సూర్యనారాయణ, పూడి చిన్నంనాయుడు అన్నదమ్ములు. వీరిది రామభద్రపురం గ్రామం. సూర్యనారాయణకు పదో ఏటనే పోలియోతో కాళ్లు రెండు చచ్చుపడ్డాయి. చిన్నంనాయుడు పుట్టుకతో అంధుడు. అయితేనేం ఆత్మవిశ్వాసంతో బతుకుబాట సాగిస్తున్నారు. వ్యవసాయ పనులతో పాటు పాడి పశువులు పోషిస్తున్నారు. ఏ పనికి వెళ్లినా సూర్యనారాయణ ట్రైసైకిల్ నడుపుతూ తోవ చూపితే చిన్నంనాయుడు వెనుక సైకిల్ తోస్తూ నడుస్తాడు. ఇద్దరూ పొలానికి వెళ్లి పాడి పశువులకు అవసరమైన గడ్డి తీసుకురావడంతో పాటు వాటి పాలు పితికి పాలకేంద్రంలో విక్రయిస్తారు. తమ కాళ్లపై తాము నిలబడుతూ అందరికీ స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నారు. నేడు (డిసెంబర్ 3) దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా దివ్యాంగుల జీవితాలు వెలుగుబాట కావాలని ఆశిద్దాం.

– రామభద్రపురం

దేదీప్యమానం



పోలిపాడ్యమి పుణ్యదినాన ఆలయాలు భక్తసంద్రమయ్యాయి. పూజలు, అభిషేకాలతో ఆధ్యాత్మిక పరిమళాలు వెదజల్లాయి. లక్ష్మీదేవిని ఆహ్వానిస్తూ అరటి తెప్పలపై భక్తుల దీపారాధనతో నదీ తీరాలు, కోనేరులు కాంతులీనాయి. విజయనగరం రింగ్‌రోడ్డులోని కళ్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద ఉన్న కోనేరు, గరుగుబిల్లి మండలం తోటపల్లిలోని వేంకటేశ్వరస్వామివారిని స్మరిస్తూ నాగావళి నదిలో దీపాలు విడిచిపెడుతున్న భక్తులను చిత్రంలో చూడొచ్చు.

– సాక్షిఫొటోగ్రాఫర్, విజయనగరం





విజయనగరం రింగ్‌రోడ్డులోని వేంకటేశ్వరస్వామి ఆలయ కోనేటిలో దీపాలు విడిచిపెడుతున్న భక్తులు



తోటపల్లిలో నాగావళి నదిలో దీపాలు విడిచిపెడుతున్న భక్తజనం

ప్రభుత్వ భరోసా శూన్యం..

దళారులకే ధాన్యం



కొండంపేట వద్ద వరిచేను కుప్పలపై రైతులు కప్పిన టార్పాలిన్‌లు

- వరి రైతులను పీకల్లోతు కష్టాల్లో ముంచేసిన కూటమి ప్రభుత్వం
- పలుచోట్ల వరి పంటకు 'తుపాను' ప్రభావంతో నష్టం
- నూర్చేసిన ధాన్యం తడవకుండా కాపాడుకోవడానికి అష్టకష్టాలు
- ధాన్యం తడిసినా కొంటామన్న భరోసా కరువు
- విధిలేని పరిస్థితుల్లో దళారులు చెప్పిన ధరకే అమ్మకం
- ధర, తూకం తేడాతో తీవ్రంగా నష్టపోతున్న రైతులు

సాక్షి ప్రతినిధి, విజయనగరం:

టీడీపీ కూటమి ప్రభుత్వ పాలనలో ఆరునెలల తిరగకముందే రైతులకు చుక్కలు కనబడుతున్నాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నాటి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో దూరదృష్టితో, మహోన్నత లక్ష్యంతో ఏర్పాటు చేసిన రైతుభరోసా కేంద్రాలు అందించిన సేవలను గుర్తుచేసుకుని రైతులు బాధపడుతున్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యం తుపాను ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు తడిచిపోతుంటే వారి కళ్లు చమర్చుతున్నాయి. భరోసా ఇవ్వాల్సిన ప్రభుత్వం ముఖం చాటేస్తోంది. మొక్కుబడిగా అక్కడక్కడా ధాన్యం కొనుగోలు కేంద్రాలు తెరిచినా అవేవీ ఇప్పుడు ఉపయోగపడట్లేదు. తడిచిన ధాన్యం మునుపటి ప్రభుత్వంలా కొంటామన్న భరోసా ఏదీ ఇవ్వట్లేదు. ఇక ఆలస్యం చేస్తే అన్నివిధాలా నష్టపోతామన్న భయంతో రైతులు తమ పంటను నష్టమైనా తక్కువ ధరకే దళారులకే విక్రయించేస్తున్నారు. ప్రతిధాన్యపు గింజను కొనుగోలు చేస్తామని టీడీపీ కూటమి నాయకులు చేస్తున్న ప్రకటనలు ఆచరణలోకి రావట్లేదని వాపోతున్నారు. విజయనగరం జిల్లాలో సుమారు 1.74 లక్షల మంది రైతులు ఈ ఖరీఫ్‌లో వరి సాగు చేశారు. దాదాపు 4.46 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారు. ఈ మేరకు 3.20 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యాన్ని ప్రభుత్వం నిర్దేశించింది. 510 రైతుసేవా కేంద్రా (ఆర్ఎస్‌కే)ల పరిధిలో 244 క్లస్టరుగా విభజించి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాల్సి ఉంది. కానీ ఇప్పటివరకూ తూతూ మంత్రంగానే వాటిని పెట్టారు.

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాటు నిర్ణీత షెడ్యూల్ ప్రకారం రైతు భరోసా పథకం ద్వారా ఇచ్చిన పెట్టుబడి సాయం రైతులకు ఎంతగానో ఉపయోగపడింది. దుక్కి పనులతో పాటు అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల కొనుగోలుకు అక్కరకు వచ్చేది. అంతేకాదు దళారుల బారినపడకుండా ఆర్‌బీకేల ద్వారానే ధాన్యం కొనుగోలు కేంద్రాలను గత ప్రభుత్వం ఏర్పాటు చేసేది. కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) ఇవ్వడంతో రైతులకు కాస్త గిట్టుబాటు అయ్యేది. టీడీపీ కూటమి నాయకులు గత ఎన్నికల సమయంలో అరచేతిలో వైకుంఠం చూపించారు. అధికారంలోకి రాగానే ప్రతి రైతుకు రూ.20 వేల చొప్పున పెట్టుబడి సాయం అందిస్తామని ఆశలు రేపారు. కానీ ఇంతవరకూ పైసా కూడా ఖాతాలో వేయలేదు. పంట పెట్టుబడికి ప్రైవేటు వడ్డీ వ్యాపారుల వద్ద రూ.3 నుంచి రూ.5 వడ్డీకి అప్పులు తెచ్చుకోవాల్సి వచ్చింది.

అంతా అయోమయం...

రైస్ మిల్లర్ల ప్రమేయాన్ని నియంత్రించే వ్యవస్థకు టీడీపీ కూటమి ప్రభుత్వం గండికొట్టేసింది. రైతులకు మేలు చేసేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలుచేసిన 'రైస్‌మిల్లుల ర్యాండమైజేషన్' విధానాన్ని ఎత్తేస్తున్నట్లు ప్రకటించింది. రైతుకు నచ్చిన మిల్లుకు ధాన్యం తీసుకెళ్లవచ్చంటూ గొప్పలు చెప్పింది. కానీ ఈ నిర్ణయమే మళ్లీ దళారుల నెట్టిన పాలుపోసినట్టయింది. మరోవైపు పంటకోత తర్వాత నూర్చిన ధాన్యాన్ని ఆరబెట్టుకుందామంటే కనీస సౌకర్యాల్లేక రైతులకు దిక్కుతోచడం లేదు. ధాన్యం పట్టడానికి 60 లక్షల వరకూ గోనె సంచులు అవసరమవుతాయి. వాటిలో రైస్ మిల్లర్లు 50 లక్షల వరకూ ఇస్తామని ప్రకటించారే తప్ప వారు ఇచ్చినవి 25 లక్షలకు మించలేదని తెలిసింది. వ్యవసాయ పరపతి సంఘాల (పీఏసీఎస్) ద్వారా పౌరసరఫరాల సంస్థ అధికారులు దాదాపు 8 లక్షల గోనె సంచులు ఇవ్వాలి కానీ ఇంతవరకు 4 లక్షలు మాత్రమే సిద్ధం చేశారు.

గద్దల్లా వాలిపోతున్న దళారులు...

ఒకవైపు ముంచుకొచ్చిన ముసురు, మరోవైపు ప్రభుత్వం నుంచి కనీసం భరోసా దక్కకపోవడంతో నైరాశ్యంలోనున్న రైతులను దోచుకునేందుకు దళారులు గద్దల్లా వాలిపోతున్నారు. తాము చెప్పిన ధరకే ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారు. వాస్తవానికి సాధారణ రకానికి కనీస మద్దతు ధర క్వింటాకు రూ.2300 చొప్పున రావాలి. కానీ దళారులు క్వింటాకు రూ.1770 మాత్రమే చెల్లిస్తున్నారు. ఇలా 50 క్వింటాళ్ల ధాన్యం విక్రయిస్తే రైతుకు రూ 26,400 వరకు నష్టం వాటిల్లుతోంది.

రైతుకు నిలువునా దగా...



రంగరాయపురంలో ధాన్యం బస్తాలపై టార్పాలిన్లు కప్పుతున్న రైతు

తీరా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ఆలస్యంగా అదీ అక్కడక్కడా తెరిచింది. అక్కడ సవాలక్ష ఇబ్బందులు పెడుతుండడంతో వేరే గత్యంతరం లేక దళారులకే, వారు చెప్పిన ధరకే రైతులు ధాన్యం విక్రయించేస్తున్నారు. ఇప్పటికే దాదాపు లక్ష మెట్రిక్ టన్నుల వరకూ దళారులే కొనుగోలు చేసి, ఇతర జిల్లాలకు తరలించినట్టు సమాచారం. ఒక్క బొబ్బిలి ఏఎంసీ పరిధిలో ఉన్న బొబ్బిలి, రామభద్రపురం, పెరుమాళి తదితర చెక్‌పోస్టుల వద్ద రూ.2 సెస్సు ప్రకారం రూ.30.02 లక్షలను వసూలు చేశారంటే ధాన్యం రూ.30 కోట్లకుపైగా తరలిపోయినట్టులెక్క. ఇక జిల్లా వ్యాప్తంగా ఉన్న ఏఎంసీల పరిధిలో మరెంత ధాన్యం తరలిపోయిందో అర్థమవుతోంది.

మొలకలు వచ్చేస్తాయి...



"నారాయణపురం కుడికాలువ ఆయకట్టుతో పాటు సాయన్నగెడ్డ ఆయకట్టులో ముంపు వచ్చేసింది. వరి పంట పూర్తిగా పొలాల్లోనే ఉండిపోయింది. ఈ వర్షాలతో నీరు చేరడంతో మా ప్రాంతంలో 4 వేల ఎకరాల్లో నష్టం ఉంటుంది. ధాన్యానికి మొలకలు వచ్చేస్తాయి. అధికారులు పరిశీలించి నష్టపరిహారం వచ్చేలా ప్రభుత్వానికి సిఫారసు చేయాలి."

– మొయ్యి మోహనరావు, మాజీ సర్పంచ్, చిత్తారిపురం, సంతకవిటి మండలం

రైతన్నల ఆందోళన



రైతులను రైస్‌మిల్లర్లు దగా చేస్తున్నారని రేగిడి మండలంలోని లక్ష్మీపురం గ్రామ రైతులు ఆ గ్రామ సచివాలయం వద్ద సోమవారం ఆందోళనకు దిగారు. ప్రభుత్వం నిర్ణయించిన 80 కిలోల ధాన్యానికి అదనంగా మరో 5 కిలోలను మిల్లర్లు అక్రమంగా వసూలు చేస్తున్నారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు పట్టించుకోకపోవడంతోనే ఈ దుస్థితి నెలకొందని ఆరోపించారు. అనంతరం అక్కడి సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతులు కెంబూరి వెంకటేశ్వరరావు, పాలధార తిరుపతిరావు, మీసాల లక్ష్మణరావు, జాడ నాగభూషణరావు, మీసాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

– రేగిడి

క్షయవ్యాధి నిర్మూలనకు కృషి చేయాలి

- కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్



వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ అంబేడ్కర్, తదితరులు

విజయనగరం ఫోర్ట్: క్షయవ్యాధి నిర్మూలనకు కృషి చేయాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అన్నారు. విజయనగరం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ఈ నెల7 నుంచి ప్రారంభం కానున్న క్షయవ్యాధి నిర్మూలన ప్రచార కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్లను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రచార కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులు, సీహెచ్‌ఓలు, ఎంఎల్‌హెచ్‌ఓలు, ఏఎన్ఎంలు, పీహెచ్‌సీ వైద్యులు, మహిళా సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొంటారన్నారు. ప్రతీ వారం ర్యాలీలు నిర్వహించి క్షయవ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించాలని వైద్య సిబ్బందికి సూచించారు. కళాశాలల సమీపంలో సిగరెట్ల విక్రయాలను నిర్మూలించాలన్నారు. ఎమ్మెల్సీ సురేష్‌బాబు మాట్లాడుతూ వ్యాధిసోకిన తర్వాత నిర్మూలించడం కంటే సోకకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవడంపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ రఘురాజు, టీబీ స్టేట్ జాయింట్ డైరెక్టర్ రమేష్, ఇన్‌చార్జి డీఎంహెచ్‌ఓ కె.రాణి, వైద్యులు మహేష్, ప్రియదర్శిని, తదితరులు పాల్గొన్నారు.

పత్తి పంటకు ఫెంగల్ ఎఫెక్ట్



ఫెంగల్ తుఫాన్ వర్షాలు పత్తి పంటకు నష్టం కలిగించాయి. పత్తి కాయలు విచ్చుకునే సమయంలో కురిసిన వర్షాలతో పంట తడిసిముద్దయింది. పత్తికాయలు కాస్తా నల్లబడ్డాయి. తేమ శాతం ఎక్కువ కావడంతో తడిసిన పత్తిని కొనుగోలు చేసేందుకు వ్యాపారులు ముందుకు రావడంలేదు. స్థానికంగా కొనుగోలు కేంద్రం లేకపోవడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. ఈ ఏడాది నష్టపోయామంటూ రాజాం, సంతకవిటి మండలాలకు చెందిన రైతులు వాపోతున్నారు.

– రాజాం



గడిముడిదాం సమీపంలో తడిసిన పత్తి పంట (ఇన్‌సెట్లో) తుఫాన్ వర్షాలకు నలుపురంగులోకి మారిపోతున్న పత్తికాయలు

సైబర్ క్రైమ్ కేసులో

ఐదుగురి అరెస్ట్

- రూ.10 లక్షల నగదు, రూ.9.20 లక్షల బంగారు ఆభరణాలు, 6 సెల్‌ఫోన్‌లు రికవరీ



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

విజయనగరం క్రైమ్: సైబర్ క్రైమ్ కేసును ఛేదించి ఐదుగురు నిందితులను అరెస్టు చేసి, వారినుంచి రూ.10 లక్షల నగదు, రూ.9.20 లక్షల విలువైన బంగారు ఆభరణాలు, నిందితులు వినియోగిస్తున్న ఆరు సెల్‌ఫోన్‌లను రికవరీ చేసినట్లు ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన జిల్లా పోలీసు కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. విజయనగరం పట్టణానికి చెందిన రిటైర్డ్ లెక్చరర్ ఉసిరికల సుజాత కుమారికి అక్టోబర్ 10న ఉదయం 10.30 గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేశారు. తాము పోలీసులమని, మీరు పంపించిన పార్సిల్స్‌లో డ్రగ్స్ ఉన్నట్లు కనుగొన్నామని, డిజిటల్ అరెస్టు చేస్తున్నామని, డీసీపీ స్థాయి అధికారి కేసు విచారణ చేస్తున్నారని, మీ బ్యాంక్ అకౌంట్‌లో ఉన్న డబ్బులను వెంటనే తాము సూచించిన బ్యాంక్ అకౌంట్‌కు పంపించాలని, బ్యాంక్ లావాదేవీలను వెరిఫై చేసిన తర్వాత, తిరిగి మొత్తాన్ని మీ బ్యాంక్ అకౌంటుకు పంపిస్తామని బెదిరించారు. దీంతో నిందితులు సూచించిన బ్యాంక్ ఖాతాకు ఆమె రూ. 40 లక్షల 11వేలు పంపించారు. అప్పటి నుంచి నిందితుల మొబైల్ ఫోన్ స్విచ్ఛాఫ్ చేసినట్లు బాధితురాలు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేసింది. ఈ మేరకు వన్‌టౌన్ పోలీసులు సైబర్‌క్రైమ్ పోర్టల్‌లో సకాలంలో ఫిర్యాదు చేయడంతో నిందితుల ఖాతాలో రూ. 20 లక్షలు ఫ్రీజ్ అయ్యాయి.

అనంతరం ఎస్పీ ఆదేశాలతో కేసు దర్యాప్తు చేపట్టిన వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ ఎస్.శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది బాధితురాలి ఖాతా నుంచి నిందితుల ఖాతాకు జమ అయిన నగదు ప్రకారం సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి నిందితులను ట్రేస్ చేశారు. ఈ కేసులో జమ్ముకశ్మీర్‌కు చెందిన మమిన్ తారిఖ్ భట్ (ఎ1), అనే నిందితుడిని అరెస్టు చేసి విచారణ చేశారు. అతని బ్యాంక్ ఖాతాను కొందరు సైబర్ నేరగాళ్లకు అద్దెకిచ్చినట్లు, తన అకౌంట్‌లో పడిన డబ్బులను ఐదు నిమిషాల వ్యవధిలోనే విత్ డ్రా చేయడం, లేదా వేర్వేరు బ్యాంక్ ఖాతాలకు ట్రాన్స్‌ఫర్ చేయడం చేస్తుంటానని, అందుకు తనకు మూడుశాతం కమీషన్ ఇస్తారని తారిక్‌భట్ విచారణలో పేర్కొన్నాడు.

మహారాష్ట్రలో నలుగురి అరెస్ట్

ఎ1 నిందితుడు ఇచ్చిన సమాచారంతో వన్‌టౌన్ సీఐ, టీమ్ మహారాష్ట్ర వెళ్లి డిజిటల్ అరెస్టు పేరుతో సైబర్ మోసాలకు పాల్పడుతున్న ముఠాను గుర్తించారు. ఈ ముఠా టెలిగ్రామ్ యాప్ ద్వారా గ్రూప్‌గా ఏర్పడి, దేశ వ్యాప్తంగా ఇదే తరహాలో డిజిటల్ అరెస్ట్ పేరుతో మోసాలకు పాల్పడుతూ, పెద్ద మొత్తంలో డబ్బులను దోచుకుంటున్నట్లు గుర్తించారు. అనంతరం ఖసిద్ది చంద్రకాంత్ సుతార్ (ఎ2), క్లైవిన్‌గ్లెన్ బ్రిట్టో (ఎ3), నితిన్ నందలాల్ సరోజ్ (ఎ4), సైఫ్ తలమీ దమండ్ (ఎ5)లను మహారాష్ట్రలోని ముంబై, పూణేల్లో అరెస్టు చేసి నిందితుల దగ్గర నుంచి రూ. 10 లక్షల నగదు, రూ. 9.20 లక్షల విలువైన బంగారు ఆభరణాలు, ఆరు మొబైల్ ఫోన్‌లను సీజ్ చేశారు. నిందితులందరి బ్యాంక్ ఖాతాలను సైబర్ నిందితులు వినియోగించుకుంటూ, కమీషన్‌గా వారికి కొంత నగదు చెల్లిస్తున్నట్లు విచారణలో వెల్లడైంది. కమీషన్ తీసుకునేందుకు అంగీకరించిన వారిని సైబర్ మోసగాళ్లు లాడ్జీల్లో బస చేయించి, వారి ఆధార్ కార్డ్, బ్యాంక్ చెక్‌బుక్‌లు, పాన్‌కార్డ్, బ్యాంక్ బుక్‌లను ముందుగా తీసుకుని, వారి వద్ద సెక్యూరిటీగా ఉంచుకుని, మోసాలకు పాల్పతున్నట్లు ఎస్పీ వివరించారు.



వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో నిందితులతో వన్‌టౌన్ సీఐ ఎస్.శ్రీనివాసరావు

పరారీలో ముగ్గురు నిందితులు

ఈ కేసులో ప్రత్యక్ష సంబంధం ఉన్న మరో ముగ్గురు నిందితులు పరారీలో ఉన్నారు.. వారిని అరెస్టు చేసేందుకు పోలీస్ బృందాలు గాలిస్తున్నట్టు ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. పరారీలో ఉన్న నిందితులను త్వరలో అరెస్టు చేస్తామన్నారు. కేసు ఛేదనలో సమర్థవంతంగా పనిచేసిన వన్‌టౌన్ సీఐ ఎస్.శ్రీనివాస్, ఎస్సై వి.ఎల్.ప్రసన్నకుమార్, కానిస్టే బుళ్ల వి.రవిశంకర్, ఎస్. రవికిశోర్, కె.సన్యాసినాయుడు, వై.రామరాజులను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించి, ప్రశంసాపత్రాలు అందజేశారు.

క్లుప్తంగా

స్పందించిన యంత్రాంగం



గంట్యాడ మండలం పెదవేమలిగ్రామంలో కళ్లంలో ఉన్న ధాన్యం పరిశీలిస్తున్న వీఏఏ ప్రమీల

సాక్షి ఎఫెక్ట్...

విజయనగరం ఫోర్ట్: తుఫాన్ కారణంగా పంట తడిచిపోవడం, ధాన్యం కొనుగోలు చేయక కళ్లాలో ధాన్యం రాసులు ఉండిపోవడం కారణంగా రైతులు ఇబ్బంది పడుతున్న అంశంపై సోమవారం 'అన్నదాతకు కష్టం' అనే శీర్షికను 'సాక్షి'లో ప్రచురించిన కథనానికి వ్యవసాయ అధికారులు స్పందించారు. రైతుసేవా కేంద్రాల్లో పనిచేసే గ్రామ వ్యవసాయ సహాయకులు క్షేత్రస్థాయిలో పర్యటించారు. గంట్యాడ మండలం పెదవేమలి గ్రామంలో రైతు కళ్లంలో ఉన్న ధాన్యంను గ్రామ వ్యవసాయ సహాయకురాలు ప్రమీల పరిశీలించి వర్షం తగ్గిన వెంటనే మిల్లుకు తరలించే ఏర్పాటు చేస్తామని తెలిపారు. విజయనగరం మండలం పినవేమలి గ్రామంలో పనలపై గ్రామ వ్యవసాయ సహాయకుడు రమేష్ దగ్గరుండి ఉప్పుద్రావణం పిచికారీ చేయించారు.

విద్యుత్ షాక్‌తో యువకుడి మృతి



మృతుడు కోనాడ ఎల్లాజీ (ఫైల్)

భోగాపురం: తెగిపడిన విద్యుత్ తీగ కాలికి తగిలి షాక్‌కు గురై ఓ యువకుడు మృతి చెందాడు. సోమవారం ఉదయం భోగాపురం మండలంలోని పోలిపల్లి గ్రామంలో జరిగిన ఈ సంఘటనపై మృతుడి బంధువులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పోలిపల్లి గ్రామానికి చెందిన కోనాడ ఎల్లాజీ(32) వేకువజామునే లేచి తన ఇంట్లో పూజలు చేసిన పువ్వులను గంగలో కలిపేందుకు గ్రామానికి సమీపంలో కొత్తచెరువు వద్దకు వెళ్లాడు. అక్కడ విద్యుత్ స్తంభం కండక్టర్ నుంచి తెగిపడి ఉన్న విద్యుత్ తీగలను గమనించకపోవడంతో అవి కాలికి తగలడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి తల్లిదండ్రులు ఎల్ల య్యమ్మ, దావనంతో పాటు తమ్ముడు ధనరాజ్ ఉన్నారు. మృతుడి తమ్ముడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్సై తవుడు తెలిపారు.

సారాతో ఇద్దరి అరెస్ట్

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): ద్విచక్రవాహనంపై సారా తరలిస్తున్న ఇద్దరు నిందితులు కురుపాం మండలంలోని మూలిగూడ జంక్షన్ వద్ద సోమవారం పట్టుబడినట్లు ఎస్సై పి.నారాయణరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆరు ట్యూబ్‌లలో నింపి ఉన్న సుమారు 240 లీటర్ల సారా, ఒక ద్విచక్ర వాహనాన్ని నిందితుల నుంచి స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

5 కిలోల గంజాయి పట్టివేత

సాలూరు: పాచిపెంట మండలంలో పి.కోనవలస చెక్‌పోస్టు వద్ద ఓ వ్యక్తి నుంచి సోమవారం ఐదు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ వెంకటసురేష్ తెలిపారు. ఒడిశా రాష్ట్రం కొరాపుట్‌కు చెందిన చిన్మయ మహారాజా అనే వ్యక్తి ఒడిశా నుంచి విశాఖపట్నానికి గంజాయిని తీసుకెళ్తుండగా పట్టుకున్నామన్నారు. ముద్దాయిని కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించినట్లు తెలిపారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹117	₹204	₹214

క్షేత్రస్థాయి పరిశీలన తర్వాతే..

వినతుల పరిష్కారం

• కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్



వినతులను స్వీకరిస్తున్న కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

విజయనగరం అర్బన్: ప్రజావినతుల పరిష్కార వేదికకు వచ్చే వినతులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన తర్వాతనే పరిష్కరించాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అధికారులకు తెలిపారు. ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి పీజీఆర్ఎస్ విశ్లేషణ నివేదిక అందిందని, వినతులకు తెలుగులోనే సమాధానాలు రాయాలని తెలిపారు. అధికారులకు కిందిస్థాయి సిబ్బందికి వినతుల ప్రాధాన్యం, ఎలా పరిష్కరించాలనే అంశాలపై శిక్షణ ఇవ్వాల్సి ఉందన్నారు. ఈ మేరకు సోమవారం పీజీఆర్ఎస్‌లో కలెక్టర్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అంతకుముందు అధికారులతో మాట్లాడుతూ జిల్లా వినతుల ఆడిట్ టీమ్ వినతుల పరిష్కారంపై సమీక్షించారు. ప్రతి రోజు లాగిన్ అయి వినతులను చూడాలని ఇంకా చూడనివి సైట్‌లో ఉండకూడదని అలాగే రీ ఓపెన్ కేసులు కూడా ఉండకూడదని వచ్చే సోమవారం నాటికి ఏ శాఖ వద్ద అర్జీలు చూడకుండా పెండింగ్ ఉన్నా రీ ఓపెన్ కేసులున్నా చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, జాయింట్ కలెక్టర్ ఎస్.సేతుమాధవన్, డీఆర్‌ఓ ఇన్‌చార్జ్ సుధారాణి, డిప్యూటీ కలెక్టర్ మురళీకృష్ణ ప్రజల నుంచి మొత్తం 116 అర్జీలు వినతులు స్వీకరించారు.

కోర్టుల్లో ఫైల్ అయిన కేసులకు వెంటనే స్పందించాలి

హైకోర్టు, జిల్లా కోర్టుల్లో ఫైల్ అయిన కేసులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించడానికి, కంటెంప్ట్‌లు పడకుండా అవసరమైన కౌంటర్లను వేయడానికి జిల్లా స్థాయి లీగల్ సెల్‌ను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ డాక్టర్ బీఆర్అంబేడ్కర్ తెలిపారు. కోర్టు వెబ్ సైట్‌లో ప్రతిరోజూ తనిఖీ చేసి జిల్లాకు సంబంధించి రెవెన్యూ, ఇతర శాఖలకు చెందిన కేసులేవైనా నమోదైతే కోర్టు ఆర్డర్స్ పడ్డాయా అనే విషయాలను తనిఖీ చేసి ప్రింట్‌లు తీసి సంబంధిత శాఖలకు వెంటనే నోడల్ అధికారి పంపిస్తారని తెలిపారు. కోర్టు ఆర్డర్స్ పడితే సంబంధిత అధికారులతో వెంటనే కౌంటర్ ఫైల్ చేసేలా చూడాలని కంటెంప్ట్‌కు అవకాశం ఇవ్వకూడదని కంటెంప్ట్ పడితే సంబంధిత అధికారిని సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు.

దెబ్బతిన్న పంట వివరాలను సమర్పించాలి

మూడు రోజుల పాటు జిల్లాలో కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న వరిపంట వివరాలను రెండు రోజుల్లో సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. కోతలు కోసి పొలాల్లో ఉన్న పంట ఎంత ఉంది? నూర్చిన ధాన్యం ఏమైనా ఉన్నాయా? గ్రామ, మండల వ్యవసాయ అధికారులు, తహసీల్దార్లు పొలాలకు వెళ్లి పరిశీలించి నివేదిక ఇవ్వాలని కోరారు. కోత కోయకుండా ఉన్నా, కుప్పలు పెట్టి ఉన్నా ఎటువంటి నష్టం జరగదు. కావున వాటి వివరాలు అవసరం లేదని నష్టం జరిగిన వాటి వివరాలను మాత్రం ప్రతి గ్రామం నుంచి రిపోర్ట్ చేయాలని స్పష్టం చేశారు.

ఎస్పీకి 25 ఫిర్యాదులు

విజయనగరం క్రైమ్: ప్రజల సమస్యల తక్షణ పరిష్కారానికి 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' ఎంతగానో ఉపయోగపడుతుందని ఎస్పీ వకుల్ జిందాల్ పేర్కొన్నారు. ఈ మేరకు జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ సెల్‌లో ప్రజల నుంచి 25 ఫిర్యాదులను ఆయన స్వీకరించి బాధితుల సమస్యలను శ్రద్ధగా విని, సంబంధిత పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడి, ఫిర్యాదుదారుల సమస్యల పరిష్కారానికి చట్టపరిధిలో చర్యలు చేపట్టి, న్యాయం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, ఎస్పీ సీఐ ఎ.లీలారావు, ఆర్‌వీఆర్‌కే.చౌదరి, డీసీఆర్‌బీ ఎస్సై రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేయాలి

• కలెక్టర్ ఎ. శ్యామ్‌ప్రసాద్



పార్వతీపురం టౌన్: ఫిర్యాదులు స్వీకరిస్తున్న అదనపు ఎస్పీ డాక్టర్ దిలీప్ కిరణ్



పార్వతీపురం: అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్



సీతంపేట: వినతులు స్వీకరిస్తున్న పీవో యశ్వంత్‌కుమార్ రెడ్డి

పార్వతీపురం: ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేయాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్‌ప్రసాద్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సోమవారం ఆయన కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్, ఎస్ఎస్ శోభిక, సబ్‌కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవలతో కలిసి అర్జీదారుల నుంచి 108 వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పీజీఆర్ఎస్‌కు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని, సమస్యకు నాణ్యమైన పరిష్కారం చూపాలని, తద్వారా అర్జీదారు సంతృప్తిని వ్యక్తం చేసేలా పరిష్కారం ఉండాలని కోరారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఒకసారి వచ్చిన అర్జీ మళ్లీ రీ ఓపెన్ కారాదని అధికారులకు స్పష్టం చేశారు. పీజీఆర్ఎస్ పర్యవేక్షణ కోసం జిల్లా స్థాయిలో నోడల్ అధికారిని నియమించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధకశాఖాధికారి డాక్టర్ ఎస్.మన్మథరావు, ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ లక్ష్మణరావు, డ్వామా పీడీ రామచంద్రరావు, డీఆర్‌డీఏ పీడీ సత్యంనాయుడు, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీ గ్రీవెన్స్ సెల్‌కు 7 ఫిర్యాదులు

పార్వతీపురం టౌన్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి జిల్లా అదనపు ఎస్పీ డాక్టర్ దిలీప్ కిరణ్ సోమవారం ఏడు ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా అర్జీదారులతో ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకుని, ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించారు. పూర్వాపరాలను విచారణ చేసి, ఫిర్యాదు అంశాలు వాస్తవాలైనట్లయితే చట్ట పరిధిలో తక్షణ చర్యలు చేపట్టాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయానికి రాలేనటువంటి ప్రజలు జిల్లాలోని పోలీస్ స్టేషన్‌లో, సర్కిల్ కార్యాలయాలు, సబ్ డివిజన్ కార్యాలయాలలో ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌బీ సీఐ రంగనాథం, సిబ్బంది పాల్గొన్నారు.

ఐటీడీఏ గ్రీవెన్స్‌సెల్‌కు 53 వినతులు

సీతంపేట: ఐటీడీఏలోని ఎస్ఆర్‌శంకరన్ సమావేశ మందిరంలో ప్రాజెక్టు అధికారి సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికకు 53 వినతులు వచ్చాయి. కుంబి గ్రామానికి చెందిన కూరంగి రామారావు వ్యవసాయ పైపులు మంజూరు చేయాలని కోరాడు. నల్లరాయిగూడకు చెందిన బి.నూకయ్య పాఠశాలలో అదనపు తరగతి భవనాన్ని మంజూరు చేయాలని వినతిపత్రం అందజేశాడు. అలాగే కొత్తగూడకు చెందిన సవర సీతమ్మ వింతతు పింఛన్ కావాలని, బుక్కిడిగూడలో మంచినీటి సమస్య పరిష్కరించాలని గ్రామస్తులు వినతిపత్రాలు అందజేశారు. పవర్‌వీడర్ మంజూరు చేయాలని పలువురు గిరిజనులు కోరారు. కార్యక్రమంలో ఏపీవో చిన్నబాబు, ఈఈ రమాదేవి, డీఈ సింహాచలం, గిరిజన సంక్షేమశాఖ డీడీ అన్నదొర తదితరులు పాల్గొన్నారు.

కుంకీ ఏనుగులు ఎక్కడ..?

• సీపీఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు



కుమ్మరిగుంటలో ధ్వంసం చేసిన టమాటో పంటను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు వేణు, ఇందిర, సాంబమూర్తి తదితరులు

కొమరాడ: ఒడిశా నుంచి 2018లో వచ్చిన ఏనుగుల గుంపు కురుపాం నియోజకవర్గం కొమరాడ మండలంలో తిష్ట వేసి ప్రాణ, ఆస్తినష్టం కలిగిస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. కుంకీ ఏనుగులను తీసుకుని వచ్చి గజరాజులను తరలిస్తామన్న పాలకుల మాటలు ఎక్కడ అని సీపీఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు ప్రశ్నించారు. ఈ మేరకు సోమవారం మండలంలోని కుమ్మరిగుంట, కందివలస, స్వామినాయుడువలస తదితర గ్రామాల్లో పంటలు ధ్వంసం చేసిన పొలాల్లో సీపీఎం నాయకుల బృందం పర్యటించింది. ఈ సందర్భంగా సీపీఎం నాయకుడు కొల్లు సాంబమూర్తి మాట్లాడుతూ ఈ ప్రాంతానికి వచ్చిన గజరాజుల గుంపు 13 మందిని పొట్టన పెట్టుకుని వేలాది ఎకరాల్లోని పంట ధ్వంసం చేసినా ప్రభుత్వానికి కనీసం చీమ కుట్టినట్లయినా లేదన్నారు. ఆరుగాలం కష్టపడి టమాటో పంటకు ఎకరాకి వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి పంట చేతికి వచ్చిన సమయంలో ఇలా ఏనుగులు ధ్వంసం చేయడంతో రైతులు ఏం చేయాలంటూ మండిపడ్డారు. ఓట్ల కోసం పాలకులు మాటలు చెప్పి గెలిచిన తరువాత కనీసం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. తక్షణం ఏనుగుల గుంపును తరలించాలని లేదంటే రైతులతో పాటు పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకురాలు ఇందిర, పలువురు రైతులు ఉన్నారు.

విద్యార్థుల్లో రక్తహీనత ఉంటే వార్డెన్లదే బాధ్యత



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

పార్వతీపురం: జిల్లాలోని ఆదర్శ పాఠశాలలు, కేజీబీవీలు, సంక్షేమ వసతిగృహాల్లో చదివే విద్యార్థుల్లో రక్తహీనత ఉంటే వార్డెన్లదే బాధ్యత అని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ స్పష్టం చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో వసతి గృహాల ప్రత్యేకాధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఇంతవరకు నిర్వహించిన మూడు పల్లెనిద్రలు, గ్రామ దర్శిని కార్యక్రమాల్లో గుర్తించిన 156 సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. వసతిగృహాల్లో మౌలిక సదుపాయాలు పూర్తిస్థాయిలో కల్పించాలని చెప్పారు. వసతిగృహాల్లో మెనూ సక్రమంగా అమలు చేయాలని, అలాగే విద్యాప్రమాణాలు మెరుగుపరచాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమాధికారి ఎస్.కృష్ణ, జిల్లా మత్స్యశాఖ అధికారి తిరుపతయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ ప్రభాకరరావు, డీఈఈఓ మంజులావీణ, డీపీఓ కొండలరావు, డ్వామాపీడీ రామచంద్రరావు, తదితర అధికారులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలి

ధాన్యం కొనుగోలు ప్రక్రియ జిల్లాలో మరింత వేగవంతం చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ మేరకు కలెక్టరేట్ వీడియో సమావేశ మందిరం నుంచి సబ్ కలెక్టర్లు, మండల అధికారులతో ధాన్యం కొనుగోళ్లు, పీజీఆర్ఎస్ తదితర అంశాలపై జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోభికతో కలిసి సమీక్షించారు. కార్యక్రమంలో పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ పి.శ్రీనివాసరావు, పశుసంవర్ధకశాఖాధికారి మన్మథరావుతో పాటు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో జిల్లా ప్రతిభ



బొబ్బిలి రూరల్: రాష్ట్రస్థాయి పోటీలో విజేతలైన క్రీడాకారులను అభినందిస్తున్న పీడీలు



భోగాపురం: బంగారు పతకం సాధించిన విద్యార్థినులు రామలక్ష్మి, దుర్గాదేవిలను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

బొబ్బిలిరూరల్: రాష్ట్రస్థాయి అండర్-17 సాఫ్ట్‌బాల్ బాలికల పోటీల్లో విజయనగరం జిల్లా జట్టు విజేతగా నిలవగా అందులో బొబ్బిలి మండలంలోని పారాది గ్రామంలో గల జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 5గురు క్రీడాకారులున్నారు.ఇటీవల కాకినాడలో జరిగిన ఈ పోటీల్లో విజేతలైన 5 మంది క్రీడాకారులను పీడీలు సత్యనారాయణ, వెంకటనాయుడులు పాఠశాల ఆవరణలో సోమవారం వారిని అభినందించారు. అలాగే వచ్చే ఏడాది జనవరిలో జరగనున్న జాతీయస్థాయి పోటీలకు పాఠశాల విద్యార్థిని సుప్రియ ఎంపికై నట్లు పీడీ తెలిపారు. విజేతలైన అందరినీ అభినందించారు. అలాగే భోగాపురం మండలం తూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థినులు ఆర్.రామలక్ష్మి, డి. దుర్గాదేవి విశేష ప్రతిభ కనబరిచి బంగారు పతకాలు సాధించారు. ఈ మేరకు బంగారు పతకాలు సాధించిన విద్యార్థినులను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వి అప్పన్న, ఉపాధ్యాయులు, పీడీ సత్యనారాయణ, గ్రామపెద్దలు, తోటి విద్యార్థులు, సిబ్బంది అభినందించారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో గురుకుల విద్యార్థుల ప్రతిభ



రేగిడి : రాష్ట్రస్థాయిలో గెలుపొందిన విద్యార్థులు

రేగిడి: మండలంలోని ఉంగరాడమెట్ట వద్ద ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులంలో చదువుతున్న విద్యార్థులు రాష్ట్రస్థాయిలో జరిగిన పోటీల్లో సత్తాచాటారు. ఏలూరు జిల్లా పెద్దవేగిలో జరిగిన స్టేట్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్‌లో సీనియర్ చెస్ విభాగంలో పి.అభిషేక్ రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానం సాధించాడు. జూనియర్స్ కేరమ్స్ పోటీల్లో పదోతరగతి విద్యార్థులు కె.అనిల్, జి.తరుణ్‌లు రాష్ట్రస్థాయిలో తృతీయ బహుమతులు సాధించారు. ఈ సందర్భంగా సోమవారం వారిని కళాశాల ఆవరణలో ప్రిన్సిపాల్ పి.శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ సూర్యనారాయణ, పీడీ రామకృష్ణ, పీఈటీ జె.చిరంజీవిలు అభినందించారు.

క్రీడల్లో మెరవాలి

• విజేతలకు మంత్రి సంధ్యారాణి అభినందనలు



క్రీడా కారులను అభినంధిస్తున్న మంత్రి గుమ్మడి సంధ్యారాణి

పార్వతీపురంటౌన్: జన జాతీయ గౌరవ దివస్-2024 కార్యక్రమంలో భాగంగా విశాఖపట్నంలో జరిగిన రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అభినందనలు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆమె గిరి ప్రతిభ కార్యక్రమం ప్రారంభోత్సవానికి విచ్చేసిన సందర్భంగా క్రీడాకారులను అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విశాఖపట్నంలో జరిగిన రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో గెలుపొందిన వారికి జావెలిన్ త్రోలో గోల్డ్ మెడల్ సంపాదించిన శ్రీధరప్పు,చందు, వాలీబాల్‌లో రెండో స్థానంలో నిలిచిన టి.జస్విన్ గ్రూప్‌కు, వ్యాసరచన పోటీలో ఆర్.గౌరీ శంకర్‌కు, పెయింటింగ్‌లో జి.దిలీప్, పి.లావణ్యలకు అవార్డులు ధ్రువీకరణ పత్రాలు సోమవారం అందజేశారు. రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని తమ నైపుణ్యం ప్రదర్శించి విజేతలుగా నిలిచి జిల్లా పేరు నిలిపారని అభినందించారు. కార్యక్రమంలో కురుపాం శాసనసభ్యురాలు, ప్రభుత్వ విప్ తోయక. జగదీశ్వరి, పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక.జయకృష్ణ, పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల.విజయచంద్ర, కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్, పార్వతీపురం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్. తిరుపతి నాయుడు, ఐటీడీఏ ఏపీఓ ఎ.మురళీధర్, వ్యాయామ ఉపాధ్యాయుడు ఎం.వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత డీఎస్సీ కోచింగ్ ప్రారంభం

పార్వతీపురంటౌన్: గిరి ప్రతిభ-ఉచిత డీఎస్సీ కోచింగ్‌ను రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి సోమవారం ప్రారంభించారు. పార్వతీపురం ఐటీడీఏ ఆధ్వర్యంలో ఉచిత డీఎస్సీ కోచింగ్‌ను గిరిజన విద్యార్థులకు గిరిజన సామాజిక భవనంలో ప్రారంభించారు. ఉచిత కోచింగ్ రెండు నెలల పాటు కొనసాగుతుంది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో మొట్ట మొదటి సారిగా పార్వతీపురం మన్యం జిల్లాలో ఏర్పాటు చేసినట్లు చెప్పారు. 16,500 పోస్టులతో మెగా డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేశారని, కోచింగ్‌కు సుముఖంగా ఉన్న అభ్యర్థులకు ఏర్పాటు చేస్తామని తెలిపారు.

కోరమాండల్ పరిశ్రమలో

డ్రైవర్ అనుమానాస్పద మృతి

• రియాక్టర్‌లో మృతదేహం



రమణ(ఫైల్)

మల్కాపురం: కోరమాండల్ పరిశ్రమలో ఓ కారు డ్రైవర్ అనుమానాస్పదంగా మృతి చెందాడు. విధులకు వచ్చే ముందు తన భార్య, పిల్లలతో సాయంత్రం త్వరగా వచ్చేస్తానని చెప్పి.. ఇంతలోనే చనిపోవడంతో వారు కన్నీటిపర్యంతమవుతున్నారు. మల్కాపురం పోలీసులు తెలిపిన వివరాలివీ.. బొబ్బిలి ప్రాంతానికి చెందిన సారిక రమణ(38) భార్య సత్యవతి, ఇద్దరు ఆడపిల్లలతో కలిసి శీలానగర్ వద్ద అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నాడు. అతను కోరమాండల్ పరిశ్రమలో ఓ ప్రైవేట్ ట్రావెల్ యజమాని వద్ద కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. రోజూ మాదిరి గానే ఆదివారం కూడా విధులకు హాజరయ్యాడు. ఈ క్రమంలో సంస్థ ఆవరణలోని రియాక్టర్ పడి.. అక్కడికక్కడే మృతి చెందాడు. సోమవారం ఉదయం తోటి ఉద్యోగులు అతని మృతదేహాన్ని గుర్తించి.. అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. సమాచారం అందుకున్న మల్కాపురం పోలీసులు పరిశ్రమ వద్దకు చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. రమణ మృతిపై ఆరా తీస్తున్నారు. అతనికి ఆర్థిక ఇబ్బందులు ఏమైనా ఉన్నాయా? లేదా సంస్థలో ఎవరైనా వేధింపులకు గురి చేశారా? కుటుంబ కలహాలు ఉన్నాయా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. కాగా.. రమణ భార్య సత్యవతి, కుటుంబ సభ్యులు పోలీస్‌స్టేషన్ వద్ద తమకు న్యాయం చేయాలని ఆందోళన చేశారు. బాధిత కుటుంబానికి రూ.40 లక్షలు నష్టపరిహారం ఇవ్వాలని కోరమాండల్ కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ యాజమాన్యాన్ని డిమాండ్ చేసింది. ఇందులో తమ తప్పిదం లేదని, అతను ఆత్మహత్య చేసుకుని ఉంటాడని యాజమాన్యం చెబుతోంది. ఇరు వర్గాల మధ్య చర్చలు జరుగుతున్నాయి.

ఎంటీఎస్‌లకు పూర్తయిన బదిలీలు



బదిలీల కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న పాలకొండ ఉప విద్యాశాఖాధికారి కృష్ణమూర్తి, ఎంఈఓలు

• బదిలీకి అంగీకరించని ఇద్దరు ఉపాధ్యాయులు



కార్యక్రమంలో పాల్గొన్న ఎంటీఎస్‌లు, ఎస్జీటీలు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు

పాలకొండ/వీరఘట్టం: పార్వతీపురం మన్యం జిల్లాలోని వీరఘట్టం, జియ్యమ్మవలస ,పాలకొండ మండలాల్లో మినిమం టైమ్ స్కేల్ (ఎంటీఎస్) పద్ధతిలో పనిచేస్తున్న 1998 బ్యాచ్ ఉపాధ్యాయులకు వర్క్ అడ్జస్ట్‌మెంట్ కోసం సోమవారం నిర్వహించిన బదిలీలు పూర్తయ్యాయి. పాలకొండ ఉప విద్యాశాఖాధికారి పట్రి కృష్ణమూర్తి ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో పలు ఉపాధ్యాయ సంఘాలు, సీతంపేట, భామిని, పాలకొండ, వీరఘట్టం మండల విద్యాశాఖాధికారుల సమక్షంలో ఈ బదిలీలను చేపట్టారు.గత ప్రభుత్వం సొంత మండలాల్లో పోస్టింగ్స్ ఇస్తే కూటమి ప్రభుత్వం తమను అన్యాయంగా వర్క్ అడ్జస్ట్‌మెంట్ పేరుతో బదిలీ చేస్తోందని ఎంటీఎస్‌లు ఆందోళనకు దిగారు.అయితే ప్రభుత్వం నుంచి వచ్చిన ఆదేశాలను మార్చలేమని, తమ చేతిలో ఏమీ లేదని అందరూ సహకరించాలని ఉప విద్యాశాఖాధికారి కోరుతూ బదిలీల ప్రక్రియ చేపట్టారు. సీనియార్టీ ప్రకారం వారిని గుమ్మలక్ష్మీపురం, కురుపాం, సీతంపేట, భామిని మండలాలకు బదిలీ చేశారు.

అంగీకరించని ఇద్దరు ఉపాధ్యాయులు

పాలకొండ డివిజన్‌లోని మొత్తం 35 పాఠశాలల్లో ఖాళీ పోస్టులు భర్తీ చేసేందుకు ఈ బదిలీలు చేపట్టగా అందులో 30 మంది ఎంటీఎస్‌లు ఉన్నారు. వారిలో ముగ్గురు ఎంటీఎస్‌లు వచ్చే ఏడాది జనవరి, మార్చి నెలల్లో రిటైర్మెంట్ కానుండడంతో వారికి బదిలీ చేయకుండా ప్రస్తుతం పనిచేస్తున్న చోటే ఉండేలా వెసులుబాటు కల్పించారు. మిగిలిన 27 మందిలో ఇద్దరు ఎంటీఎస్‌లు బదిలీలకు అంగీకరించలేదు. ప్రభుత్వం తమపై ఎటువంటి చర్యలు తీసుకున్నా మేము సిద్ధంగా ఉన్నామని రాతపూర్వకంగా డిప్యూటీ ఈఓ కృష్ణమూర్తికి వారిద్దరూ వాగ్మూలం ఇచ్చారు.మిగిలిన 25 మందికి బదిలీలు చేపట్టగా ఇంకా 10 పోస్టుల్లో ఖాళీలు మిగిలి ఉన్నాయి. ఈ ఖాళీ పోస్టుల్లో 8 మంది జూనియర్ సెకెండరీ గ్రేడ్ ఉపాధ్యాయులను పంపించేందుకు బదిలీలు చేపట్టగా ఏడుగురు అందుబాటులో ఉండగా వారికి కావాల్సిన స్థానాల్లో భర్తీ చేశారు. ఓ ఎస్జీటీ మాత్రం అందుబాటులో లేకపోవడంతో ఆ ఖాళీని భర్తీ చేయలేదు. మొత్తం 35 ఖాళీలకు గాను 32 పోస్టులు భర్తీ చేసినట్లు ఉప విద్యాశాఖాధికారి కృష్ణమూర్తి తెలిపారు.మిగిలిన మూడు పోస్టుల్లో ఇద్దరు ఎంటీఎస్‌లు, ఒక జూనియర్ ఎస్జీటీని నియమించాల్సి ఉందని, ఈ నివేదికను ప్రభుత్వానికి అందజేసి తదుపరి ప్రభుత్వ ఉత్తర్వులు ప్రకారం చర్యలు చేపడతామన్నారు. ఈ బదిలీల్లో పాలకొండ, వీరఘట్టం, భామిని, సీతంపేట ఎంఈఓలు సోంబాబు,ఆర్.ఆనందరావు,కె.శ్రీనివాసరావు, డి.సూర్యచంద్రరావుతో పాటు ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఆశ్రమపాఠశాలల టీచర్లకు డిప్యుటేషన్ వద్దు

• యూటీఎఫ్ విజ్ఞప్తి



పీఓకు మెమొరాండం అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

సీతంపేట: ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమపాఠశాలల నుంచి ఉపాధ్యాయులను గురుకులాలకు డిప్యుటేషన్ వేయవద్దని యూటీఎఫ్ నాయకులు ఎస్.మురళీమోహన్ రావు, కె.కృష్ణారావులు, ఎ.భాస్కరరావులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఐటీడీఏ పీఓ యశ్వంత్‌కుమార్ రెడ్డికి సోమవారం వినతిపత్రం అందజేశారు. గిరిజన గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో అవుట్‌సోర్సింగ్ ప్రాతిపదికన పనిచేస్తున్న టీచింగ్ స్టాఫ్ సమస్యలు పరిష్కరించాలే తప్ప వారి స్థానాల్లో డిప్యుటేషన్ వేయడం తగదని అసంతృప్తి వెలిబుచ్చారు. అంతకు ముందు రిలేనిరాహార దీక్షల శిబిరం వద్దకు వారు వెళ్లి సంఘీభావం తెలిపారు. ఆశ్రమపాఠశాలల ఉపాధ్యాయులు డిప్యుటేషన్ ఆర్డర్ తీసుకోవద్దని హితవు పలికారు.